


ఆంధ్రజ్యోతి



'సంక్షేమ' జల్లు!

- రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో వివిధ వర్గాలపై వరాల జల్లు
- మహిళలు, నాయీబ్రాహ్మణులు, చేనేత, కల్లుగీత కార్మికులకు బొనాంజా
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై పూర్తిస్థాయి స్పష్టత
- సెలూన్లకు ఉచిత విద్యుత్ 200 యూనిట్లకు పెంపుతో హర్షం
- చేనేత కార్మికులకు ఒకేసారి ఉచిత విద్యుత్, జీఎస్టీ చెల్లింపు, త్రిఫ్ట్ పథకాలు
- కొత్త బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు తెరుచుకునే ఛాన్స్

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పలు కీలక నిర్ణయాలు ప్రకటించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు బడుగు, బలహీనవర్గాలకు ఆర్థికంగా మరింత తోడ్పాటునందించేలా వరాల జల్లు కురిపించింది. మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, నాయీబ్రాహ్మణులు ఇలా అనేక వర్గాలకు ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలను ప్రకటించింది. తద్వారా ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన అనేక హామీలు అమలుచేసేలా క్యాబినెట్ నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా ఆగస్టు 15 నుంచి అమలుకానున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై మంత్రి మండలి పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చింది. మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడకు ఏయే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చనేదానిపై కీలక నిర్ణయాలు ప్రకటించింది. రాష్ట్రానికి చెందిన మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రకటించింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణానికి ప్రభుత్వం అనుమతించింది. ఉచిత సౌకర్యం వినియోగించుకునేందుకు ఆధార్, ఓటర్, రేషన్‌కార్డుల్లో ఏదొకటి చూపిస్తే చాలని స్పష్టత ఇచ్చింది. అలాగే ఉచిత బస్సు పథకం నాన్‌స్టాప్, అంతర్ రాష్ట్రీయ బస్సు సర్వీసులు, లేదా ఇతర ఏ కేటగిరీలకు వర్తించదని పేర్కొంది. పథకం అమలుకు నెలకు రాష్ట్రవ్యాప్తంగా రూ.162 కోట్ల వరకు ఖర్చవుతుండగా, ఉమ్మడి జిల్లాలో రూ.16 కోట్ల వరకు ప్రభుత్వంపై భారం పడనుంది. మరోపక్క ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రద్దీ పెరగనున్నందున మహిళల భద్రత కోసం బస్సు లోపల సీసీ కెమెరాలు, మహిళా కండక్టర్లకు బాడీ వార్న్ కెమెరాలు ఇవ్వనున్నట్టు క్యాబినెట్ వెల్లడించింది. అందులో భాగంగా పథకం అమలుకోసం ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో దాదాపు 600 బస్సులను సిద్ధం చేస్తున్నారు. అలాగే అన్ని బస్సు డిపోల్లో ప్రయాణికుల కోసం ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం కూడా కల్పించడానికి క్యాబినెట్ నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో అనేక బస్టాండ్ల రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం హెయిర్ కటింగ్ సెలూన్లకు అమలవుతున్న 150 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు అయితే ప్రభుత్వం బొనాంజా ప్రకటించింది. ఒకేసారి మూడు పథకాలకు ఆమోదం తెలిపింది. మగ్గాలకు ఉచిత విద్యుత్, చేనేత విక్రయాలపై జీఎస్టీ రద్దు, త్రిఫ్ట్ ఫండ్ పథకం ప్రారంభించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ వల్ల ఉమ్మడి జిల్లాలో 6,548మందికి రూ.3.92కోట్ల లబ్ధిచేకూరనుంది. అలాగే చేనేత ఉత్పత్తులపై చెల్లించే జీఎస్టీని ప్రభుత్వం నేతన్నలకు తిరిగి చెల్లించాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం నేతన్నల్లో సంతోషం మిన్నంటేలా చేస్తోంది. దీంతో కాకినాడ జిల్లాలో 23 సంఘాలకు రూ.12 లక్షలు, కోనసీమ, తూ.గో జిల్లాల్లో నేతన్నలకు రూ.75లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ఇక ఈనెలతో ముగియనున్న పాత బార్ లైసెన్సుల నేపథ్యంలో వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభం కానున్న కొత్త బార్లకు సంబంధించి విధివిధానాలను క్యాబినెట్ వెల్లడించింది. కొత్త బార్లు ఇకపై ఉదయం పది నుంచి రాత్రి 11వరకు తెరవడానికి అనుమతించింది. అలాగే కల్లుగీత కార్మికులకు బార్ ఫీజులో యాభై శాతం తగ్గింపుతో కల్లుగీత కార్మికులకు తీపి కబురు అందించింది.

వాడపల్లిలో ముగిసిన స్వామివారి పవిత్రోత్సవాలు

7



వాడపల్లి వెంకన్న ఆలయంలో పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

చేనేత సొబగులు



- దారాలతో కళాఖండాల సృష్టి నేతన్నల సొంతం
- చేనేతలపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు
- చేనేత రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు నడుం బిగించిన రాష్ట్ర ప్రభుత్వం 6
- నేడు చేనేత దినోత్సవం

కదతారా.. లేదా?

రావులపాలెం కళావెంకట్రావు సెంటర్



- రావులపాలెంలో ఫ్లైఓవర్ నిర్మాణం జరిగేనా?
- సర్వేలే తప్ప కార్యరూపం దాల్చని వైనం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

కోనసీమ ముఖద్వారం



నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే జాతీయ రహదారి అది. ఆ సెంటర్ దాటాలంటే ట్రాఫిక్ సమస్యలు, అతివేగం కారణంగా రోడ్డు ప్రమాదాలతో హడలిపోయే పరిస్థితి. రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు రాకపోకలు సాగించే సమయాల్లో ఏదైనా ప్రమాదం జరిగి ట్రాఫిక్ నిలిచిపోతే అధికారులు హడావిడి చేయడం తర్వాత పట్టించుకోరు. ఇది షరా మామూలే. ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముఖద్వారమైన రావులపాలెం జాతీయ రహదారిపై ఉన్న కళా వెంకట్రావు సెంటర్ మీదుగా వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ నిలిచిపోతుంటే వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్ కట్టాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కానీ అది ఎప్పటికీ కలగానే మిగిలిపోతోంది.

(ఆంధ్రజ్యోతి-రావులపాలెం)

రాజమహేంద్రవరం, కాకినాడ వంటి నగరాల్లోని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టారు. రావులపాలెంలో మాత్రం సర్వేలు,వ్యాపారులతో సమావేశాలు తప్ప నిర్మాణ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలులేవు. చెన్నై-కోల్‌కత్తామార్గంలో 216(ఏ) జాతీయరహదారి రావులపాలెం, ఆలమూరు మండలాల్లో 25కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. జిల్లాలోని ప్రజలు అధికారులు, జిల్లా కేంద్రమైన అమలాపురం వెళ్లేందుకు ఈ సెంటర్ మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. కానీ, ఫ్లైఓవర్ నిర్మాణానికి మీనమేషాలు లెక్కించాల్సిన పరిస్థితి.

సర్వేలే తప్ప ఆచరణ శూన్యం

రావులపాడు వంతెననుంచి రావులపాలెం ప్రభుత్వ కళాశాలల సెంటర్ వరకూ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టేందుకు గతంలో అధికారులు సర్వే చేశారు. ఆ సమయంలో ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారని, ట్రాఫిక్ కష్టాలు తీరినట్లేనని ప్రజలు భావించారు. సర్వే తర్వాత నిర్మాణ దిశగా అడుగు పడకపోవడంతో నిరాశే మిగిలింది.

ఎమ్మెల్యేతో సమావేశం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రావులపాలెంలో నిత్యం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలను ప్రజలు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన మూడు నెలల క్రితం సర్వే అధికారులు, ఆర్‌అండ్‌బీ, పోలీస్, ఇతరశాఖల అధికారులతో రావులపాలెం సెంటర్ సమీప ప్రాంతాలను సర్వీసు రోడ్లను పరిశీలించి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఫ్లైఓవర్ నిర్మాణ అభ్యంతరాలపై చర్చించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. ఇక్కడ సమావేశంలో రావులపాలెం సుందరీకరణకు తనవంతు కృషిచేస్తానని, దానికి అందరూ సహకరించాలని కోరారు. ఈసమావేశం జరిగి మూడునెలలు కావస్తున్నా పనులేవీ ముందుకు కదలలేదు.

ట్రాఫిక్ సిగ్నల్ లేని హైవే సెంటర్

నిత్యం వందలాది వాహనాలతో రాకపోకలు సాగించే రావులపాలెం కళావెంకట్రావు సెంటర్ ట్రాఫిక్ సిగ్నల్స్‌కు నోచుకోలేదు. ఫ్లైఓవర్ నిర్మాణం కలగా మిగిలిపోయే పరిస్థితులు కనబడుతున్న నేపథ్యంలో కనీసం అధికారులు సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే కొంతమేర ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉంది.

ఆక్రమణల చెరలో సర్వీసు రోడ్లు

పాదచారులకు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా హైవే నిర్మాణ సమయంలో రహదారికి అనుసంధానంగా అధికారులు సర్వీసు రోడ్లను ఏర్పాటు చేశారు. అవి ఆక్రమణలకు గురికావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న రావులపాలెం వ్యాపార కార్యకలాపాలకు నెలవుగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారులు ఇక్కడి షాపులను అద్దెకు తీసుకుని నడిపిస్తున్నారు. దీనికి భవన యజమానులకు రూ.లక్షల్లో అద్దెలు వస్తున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణం జరిగితే అద్దెలు ఆగిపోతాయని షాపుయజమానులే నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య

చెన్నై-కోల్‌కతా హైవేపై వెళ్లే వాహనాలు రావులపాలెం సెంటర్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తితే కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు రావులపాలెం వచ్చేసరికి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడంలేదు. ఏడు శనివారాల వెంకన్న దర్శనానికి శనివారం ఒక్కరోజే 60వేలమందికి పైగా భక్తులు ఈసెంటర్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. సుదూర ప్రాంతాలనుంచి సునాయాసంగా వస్తున్న భక్తులు ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులకు గురవుతున్నారు.



కళా వెంకట్రావు సెంటర్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్

హైవేల్లో జంక్షన్లు అభివృద్ధి చేయాలి

- నవంబరు నాటికి చించినాడ వంతెన మరమ్మతులు పూర్తి
- కలెక్టర్ ఆదేశం

అమలాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎదుర్లంక నుంచి దిండి వరకు ఉన్న 216 జాతీయ రహదారిపై ప్రమాదల నివారణతోపాటు ముఖ్య కూడళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాతీయ రహదారి భద్రతపై బుధవారం జరిగిన సమీక్షలో ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం దిండి-చించినాడ బ్రిడ్జి మరమ్మతు పనులు, వివిధ సర్వీసు రోడ్ల నిర్మాణాలపై ఆయన సమీక్షించారు. 216 జాతీయ రహదారి రాజోలు బైపాస్ రోడ్డు ప్రారంభం నుంచి పాశర్లపూడి వరకు ఆక్రమణల తొలగింపు, జంక్షన్ల అభివృద్ధి, ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. చించినాడ వంతెన పెడల్స్ బేరింగులు ఏర్పాటు, మరమ్మతులు నవంబరు నెలాఖరు నాటికి పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరించాలని టాటా ప్రాజెక్టు అధికారులకు సూచించారు. అమలాపురం, ముమ్మిడివరం బైపాస్ రోడ్ల జంక్షన్లను పూర్తిస్థాయిలో సరిచేసి రహదారి భద్రతను మెరుగుపరచాలని, ఒక నెలలో భద్రతా సమస్యలపట్ల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూలు వద్ద బైపాస్ రోడ్డుకు సర్వీసు రోడ్డు వేయాలని ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ సాయిశ్రీనివాస్‌ను ఆదేశించారు. 216 హైవేపై ప్రమాదాలు ఆందోళనకరంగా ఉన్నాయని, అధికారులు నివారణా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్‌హెచ్ అధికారి వెంకటరమణ, ప్రాజెక్టు ప్రతినిధి గోపాల్, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ ఏసుబాబు పాల్గొన్నారు.

కువైట్‌లో పొన్నమండ యువకుడి మృతి

7

అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు

- మలికిపురం మహిళలకు ఎస్‌ఐలుగా ఒకేచోట పోస్టింగ్ 7

అమలాపురం ఆర్టీసీ డిపోలో జేసీ పర్యటన

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో సౌకర్యాల పరిశీలన

అమలాపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ఎన్నికల హామీ మేరకు ఈనెల 15నుంచి మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో అమలాపురం ఆర్టీసీ డిపోలో సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై బుధవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పరిశీలించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తొలుత ఆర్టీసీ డిపోలో గంటసేపు ఆమె పరిశీలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఖాళీ స్థలాన్ని పరిశీలించి షాపులు, షాపింగ్ మాల్స్ నిర్మిస్తే అదనపు ఆదాయం వస్తుందని కదా అని సూచించారు. డిపోనుంచి నడుపుతున్న బస్సుల సంఖ్యపై ప్రశ్నించగా డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ బదులిచ్చారు. రవాణాశాఖ అధికారులు సీజ్ చేసిన వాహనాలు ఇక్కడే ఉంటాయని, పాడైపోయిన వాహనాల గురించి ఆమెకు వివరించారు. ప్లాట్‌ఫారాలు పరిశీలించి ప్రయాణికులతో సౌకర్యాలపై జేసీ ఆరా తీశారు. ఆర్టీసీ టాయిలెట్ల పరిశుభ్రతను, షాపులను పరిశీలించి పలు సూచనలుచేశారు.

అనంతరం జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్టీపీ భార్గవకుమార్ కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం అమలాపురం డిపోనుంచి రోజువారీగా 25వేల మంది ప్రయాణిస్తున్నారని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడంవల్ల ఆ సంఖ్య 40వేలకు పెరిగే అవకాశం ఉందని వివరించారు. 15నుంచి ఉచిత బస్సు పథకం ప్రారంభం కానున్న దృష్ట్యా ఆర్టీసీ కండక్టర్లకు అందించే టిమ్‌లను సిద్ధం చేస్తున్నామని, అందుకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశామని డీఎం మూర్తి వివరించారు. మహిళా ప్రయాణికులకు వారు ప్రయాణించిన దూరాన్ని బట్టి చార్జీల వివరాలు టిక్కెట్‌లో ఉంటాయని, అంతమేర వారికి రాయితీ లభించినట్టు సూచిస్తుందని వివరించారు. అమలాపురం ఆర్టీసీ డిపోకు రోజుకు రూ.24.56లక్షల ఆదాయం వస్తుందన్నారు. కార్గో సర్వీసు నుంచి రోజుకు రూ.5లక్షల10వేల646 ఆదాయం ఉందని వివరించారు. ఇటీవల నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో ఆర్టీసీ సేవలపై 30శాతం నెగిటీవ్ వచ్చిన విషయంపై జేసీ అధికారులను ప్రశ్నించారు. పనితీరును మరింత మెరుగుపరుచుకుని మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి, ఓటీఆర్ఎస్ ఎస్.వరహాలబాబు పాల్గొన్నారు.



అమలాపురం ఆర్టీసీ డిపోలో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అందుబాటులో 19వేల టన్నుల ఎరువులు

- జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తి
- ప్రకృతి వ్యవసాయంలో రైతులు భాగస్వామ్యం కావాలి
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి.బోసుబాబు

పి.గన్నవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సొసైటీలు, ఆర్ఎస్‌కేలు, ఎరువుల షాపుల్లో 19వేల టన్నుల ఎరువులు రైతులకు అందు బాటులో ఉంచామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి.బోసుబాబు తెలిపారు. పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో విలేజ్ అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్లకు ప్రకృతి వ్యవసాయంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 6,700టన్నుల యూరియా అందుబాటులో ఉందని, మరో 700టన్నులు రావడానికి సిద్ధంగా ఉందన్నారు. నానో యూరియా, డీఏపీలను సైతం రైతులు వాడుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 1.63 లక్షల ఎకరాలకు గాను ఇప్పటివరకు 1.25 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని తెలిపారు. మెట్టప్రాంతంలో నాట్లు పూర్తికావచ్చాయని, పి.గన్నవరం,రాజోలు సబ్‌డివిజన్‌ల పరిధిలోనే నాట్లు పూర్తి కాలేదని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి రైతు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఘన, ద్రవ జీవామృతాల కషాయాలను ఉపయోగించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై విలేజ్ అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్‌లు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వరిచేల గట్లపై ఎరువులు లేని కూరగాయలను పండిస్తే ఆరోగ్యంతోపాటు అదనపు ఆదాయం వస్తుందన్నారు.



పి.గన్నవరంలో విలేజ్ అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బోసుబాబు

22వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం

జిల్లావ్యాప్తంగా 92 గ్రామాల్లో వరి, కొబ్బరి పంటలకు సంబంధించి 22వేల ఎకరాల్లో సంబంధిత రైతులు ప్రకృతి వ్యయసాయ పద్ధతులను పాటిస్తున్నారని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీనివాస్ తెలిపారు. పలు గ్రామాలకు సంబంధించి 1600ఎకరాల్లో పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్నారన్నారు. ముఖ్యంగా రెండో పంటలో ఏప్రిల్, మే నెలల్లో 25 నుంచి 30 రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో నవధాన్యాలు చల్లితే ఏపుగా పెరిగిన పచ్చరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుందని, తద్వారా భూమికి బలం చేకూరుతుందని అన్నారు. గ్రామస్థాయిలో ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్గి ఉండాలనే లక్ష్యంతో విలేజ్ అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్లకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రెండురోజులపాటు అవగాహన కార్యక్రమం, ఒక రోజు మాత్రం క్షేత్రస్థాయిలో ప్రకృతి ఎరువుల తయారీ, ఉపయోగం తదితర అంశాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో మామిడికుదురు వ్యవసాయ అధికారి ఎన్వీ సత్యనారాయణ, ట్రైనర్స్ హేమలత,జె.నాగవేణి, ఎం.సూరిబాబు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల్లో అవినీతిని ఉపేక్షించేది లేదు

- డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

మామిడికుదురు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డీసీసీ బ్యాంకులో అవినీతి జరిగితే ఉపేక్షించేది లేదని వెంటనే చర్యలు తీసుకుంటామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. మామిడికుదురులోని డీసీసీబీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగుల పనితీరు రైతులకు ఎటువంటి సహాయ, సహకారాలు అందిస్తున్నారన్న అంశాలపై పరిశీలన చేశారు. ఎటువంటి లోపాలు జరిగినా ఉపేక్షించేది లేదని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకుకు వచ్చిన ప్రతి రైతుపట్ల గౌరవంగా, బాధ్యతగా పలకరించి వారికి కావాల్సిన వివరాలు తెలియచేయాలన్నారు. అవినీతికి పాల్పడితే ట్రాన్స్‌ఫర్లు కాకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. బ్యాంకుల్లో డిపాజిట్లు పెంచేలా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు.



మామిడికుదురు డీసీసీబీ బ్రాంచిలో ఖాతాదారులతో మాట్లాడుతున్న రామస్వామి

ప్రతి మండలంలో కోకో గింజల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

- ఏపీ కోకో రైతుల సంఘం అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ

అంబాజీపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి అంతర పంటలుగా సాగు చేస్తున్న కోకో పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తున్నా సరైన గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏపీ కోకో రైతుల సంఘం అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, కార్యదర్శి కె.శ్రీనివాసులు అన్నారు. అంబాజీపేట కోనసీమ కోప్రా మర్చంట్స్ అసోసియేషన్ హాలులో బుధవారం ఏపీ కోకో రైతుల సమావేశం కోనసీమజిల్లాఅధ్యక్షుడు భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ కోకో రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రతిమండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కోకో రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు కోకోబోర్డు ఏర్పాటు చేయాలని, అన్నిరకాల రాయితీలు, సదుపాయాలు కల్పించాలని కోరారు. కోకో గింజలను విక్రయించడంలో ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేసుకుని ఎగుమతి చేయాలని కోరారు. గతేడాది కిలో కోకో గింజలను రూ.1000కు కొనుగోలు చేశారని, ప్రస్తుతం కోకో గింజలను కేజీ రూ.450కు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది 75వేల ఎకరాల్లో సాగు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిపై అధికారులు రైతులతో మాట్లాడి కోకో పంటలను వేయిస్తున్నారన్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వం రాయితీలు కల్పించి పంట ఎక్కువ ధరలకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. దీంతో రైతుల్లో ఆసక్తి పెరిగి మరికొందరు కోకో పంటలపై దృష్టిసారిస్తారన్నారు. ప్రభుత్వం ఈఏడాది 20వేల మెట్రికల్ టన్నుల గింజలను కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. అంతర్జాతీయ ధరలతో పోల్చుకుంటే రూ.800కోట్లను కోకో రైతులు నష్టపోతారని, ప్రభుత్వం రూ.14.8 కోట్లను మాత్రమే ఇవ్వడంతో రూ.785.20కోట్లు నష్టపోయారన్నారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో ఏపీ కోకో రైతు సంఘ సహాయ కార్యదర్శి వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి ఆనందప్రసాద్, జిల్లా కార్యదర్శి అడబాల రాజమోహన్, రైతులు ముత్యాల జమీలు, గణపతి వీరరాఘవులు, అడ్డాల గోపాలకృష్ణ, చేకూరి సూర్యనారాయణ, అయ్యగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఏపీ కోకో రైతుల సంఘం సభ్యులు

చేనేత సొబగులు

చేనేతలపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నేతన్నలపై వరాల జల్లు కురిపించింది. చేనేత మగ్గానికి 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ప్రకటించింది. నేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీని ప్రభుత్వమే భరించాలని రాష్ట్ర సచివాలయంలో చేనేత శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షలోప్రకటించారు. దానికి తోడు కేంద్ర ప్రభుత్వం నేత కార్మికుల కోసం అమలుచేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయల త్రిఫ్ట్ ఫండ్ నిధులను చేనేత కార్మికులకు అందించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై నేత కార్మికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను పునరుద్ధరిస్తే చేనేత రంగం పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని నాయకులు చెప్తున్నారు. నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

నేతన్నల ఇంట విద్యుత్ వెలుగులు

కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. దాంతో నేతన్నల ఇంట ఉచిత విద్యుత్ వెలుగులు ప్రసరించనున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 54 చేనేత సహకార సంఘాల పరిధిలో 9745 మంది సభ్యులు ఉన్నారు. చంద్రబాబు ప్రభుత్వం చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనుంది. 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్‌ను వినియోగించే కుటుంబాలకు సైతం వెసులుబాటు కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో 6,545 మందికి రూ.3.29 కోట్ల ఉచిత విద్యుత్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 6,548 మంది చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందించేందుకు చేనేత, జౌళి శాఖ అధికారులు గుర్తించారు. వీరికి రూ.3.92 కోట్ల విలువైన ఉచిత విద్యుత్ అందించనున్నారు.


చేనేత వస్త్ర ధారణలో విదేశీ వనిత

రంగు రంగుల దారాలతో అద్భుత కళాఖండాలను అల్లుతూ చేనేత రంగాన్ని నిత్య నూతనంగా ఉంచేందుకు నేతన్నలు నిరంతరం శ్రమిస్తున్నారు. అపార ప్రతిభ, నైపుణ్యం నేతన్నల సొంతం. అగ్గిపెట్టెలో



పట్టేటంత చీరను నేసింది.. అతుకులు లేకుండా జాతీయ పతాకాన్ని తయారు చేసింది, దేవతామూర్తులను సైతం చేనేత వస్త్రాలపై ఆవిష్కరించిన ఘనత నేత కార్మికులదే. అటువంటి చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది.




చేనేత చీర కట్టులో విద్యార్థిని

దారాలతో కళాఖండాల సృష్టి నేతన్నల సొంతం

చేనేత రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు నడుంబిగించిన రాష్ట్ర ప్రభుత్వం

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

నేత కార్మికుల సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించేందుకు 2015 సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రకటించారు. అప్పటి నుంచి ప్రతిఏటా ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నాం. తొలుత చేనేత వస్త్రాలనే ఉద్యమానికి వారధిగా వినియోగించి విదేశీ వస్తువుల బహిష్కరణ ఉద్యమాన్ని బ్రిటీషు ప్రభుత్వ హయాంలో చేపట్టారు. అందుకే 119 ఏళ్ల క్రితం జరిగిన స్వదేశీ ఉద్యమానికి ప్రతీకగా అటువంటి చారిత్రక సందర్భాన్ని జాతీయ చేనేత దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

రాయితీ బకాయిల విడుదలతో చేనేత సంఘాలకు లబ్ధి

చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే కార్మికులకు సైతం ఎంతో లబ్ధి చేకూరుతుందని కార్మిక సంఘ నాయకులు చెప్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తానికి మాత్రమే పరిమితమై చేనేత కార్మికులకు, సంఘాలకు ఉపయుక్తమైన ఎన్నో పథకాలకు మంగళం పాడేసింది. దాంతో జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు 20 నుంచి 40 శాతం నూలు సబ్సిడీపై రూ.3.55 కోట్లు బకాయిలు ఉండగా 20 నుంచి 30 శాతం చేనేత వస్త్రాల రిబేటు పథకంలో రూ.2.81 కోట్లు బకాయిలున్నాయి. త్రిఫ్ట్ ఫండ్ పథకంలో రూ.81.20 లక్షలు, పావలా వడ్డీ రాయితీ కిందరూ.3.56 కోట్లు, మార్కెటింగ్ ఇన్సెంటివ్ కింద రూ.3.40 కోట్లతో పాటు ఆప్కో చెల్లించాల్సిన బకాయిలు కోనసీమ జిల్లాకు రూ.వంద కోట్ల పైబడి ఉన్నాయి.


నేడు జాతీయ చేనేత దినోత్సవం

రూ.82 లక్షల మేర జీఎస్టీ లబ్ధి

చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీ భారాన్ని భరించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రూ.82లక్షల మేర జీఎస్టీ లబ్ధి చేకూరనుంది. చేనేత సహకార సంఘాలు ఏటా రూ.20 లక్షలు టర్నోవర్ దాటితే జీఎస్టీ పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం ఆమొత్తాన్ని రూ.40లక్షలకు పెంచారు. ఇంచుమించు ఉమ్మడి జిల్లాలోని సంఘాలన్నీ జీఎస్టీ పరిధిలోకి వచ్చాయి. దాంతో సహకార సంఘాలు కొనుగోలు చేసిన చిలపనూలుపై 5 శాతం జీఎస్టీ భారం పడింది. కోనసీమ జిల్లాకు రూ.55లక్షలు, కాకినాడ జిల్లాకు రూ.12లక్షలు, తూర్పు గోదావరి జిల్లాకు రూ.15లక్షలు జీఎస్టీ మినహాయింపు లభించనుంది. ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించి చేనేత సంఘాలకు చెల్లించే ఏర్పాట్లు చేసింది.

రూ.65లక్షల త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చేనేత కార్మికుల ఖాతాలకు రూ.65లక్షలు మేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు జమకానున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా చేనేత కార్మికులు ఉండడంతో రూ.52లక్షలు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు రూ.13లక్షలు చొప్పున త్రిఫ్ట్ ఫండ్ నిధులు మంజూరు అయ్యాయని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు కె.పెద్దిరాజు తెలిపారు. ఇప్పటికే ఆయా మొత్తాలను సీఎఫ్‌ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద ఒక్కో కార్మికుడు రూ.8 చొప్పున నిల్వ చేసుకుంటే దానికి రూ.16చొప్పున ప్రభుత్వం జమచేసి రూ.24 చొప్పున అందిస్తుంది.

జిల్లా	సాధారణ మగ్గాలు	ఉచిత విద్యుత్ రాయితీ
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	3610	రూ.2.17 కోట్లు
కాకినాడ	2150	రూ.1.29 కోట్లు
తూర్పు గోదావరి	788	రూ.0.47 కోట్లు

పాత పథకాలను పునరుద్ధరించాలి

దొంతంశెట్టి సత్యప్రకాష్, లివరీ చేనేత సహకార సంఘాల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్



గతంలో టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన పథకాలను పునరుద్ధరించాలి. ప్రధానంగా పావలా వడ్డీ పథకం, నూలుపై సబ్సిడీ, 30శాతం రిబేటు విధానాన్ని కొనసాగించాలి. చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిపడ్డ మొత్తాలను తక్షణం విడుదల చేయాలి. తొమ్మిది నెలలుగా బకాయిలు విడుదల కాక చేనేత సహకార సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఆప్కోకు తక్షణం ఎన్నికలు నిర్వహించి సహకార సంఘాల నుంచి పూర్తిస్థాయిలో వస్త్ర ఉత్పత్తులు కొనుగోలు చేసి వెంటనే నిధులు విడుదల చేయాలి.

నేతన్నలకు హామీతో కూడిన ఉపాధి కల్పించాలి

చింతా శంకరమూర్తి, మాజీ జడ్పీటీసీ, బండారులంక



చేనేత కార్మికులకు హామీతో కూడిన ఉపాధి కల్పించాలి. గతంలో అమలుచేసిన జనతా వస్త్రాల పథకాన్ని పునరుద్ధరించాలి. నేత కార్మికులకు ఉపాధి హామీలో స్థానం లేకపోవడంతో ఉపాధికై ఎదురు చూస్తున్నారు. చేనేత రంగంపైజీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కల్పించే చేనేత పరిశ్రమకు అన్ని రకాల పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలి. చేనేత సహకారసంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు చేనేత వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి.

మారుమూల గ్రామంలో చేనేత దినోత్సవం

వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ మంత్రి



జాతీయ చేనేత దినోత్సవాన్ని రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో మారుమూల గ్రామమైన ఆదివారపుపేటలో నిర్వహించేందుకు చేనేత నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. 70 మంది కార్మికులకు రూ.50వేలు చొప్పున ముద్ర రుణాలు, 25 మందికి చేనేత మగ్గాలు అందిస్తాము. జిల్లాలోని చేనేత సహకార సంఘాల ప్రతినిధులను ఆహ్వానించాం. చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాము.

ఉమ్మడి జిల్లాలో మూడుచోట్ల చేనేత దినోత్సవ సభలు

కె.పెద్దిరాజు, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు



జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం. కోనసీమ జిల్లాకు సంబంధించి రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ఆదివారపుపేటలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పాల్గొంటారు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురంలో జరిగే సభలో కలెక్టర్ షాన్‌మోహన్, తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం మురమండలో జరిగే చేనేత దినోత్సవంలో కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

ఎరుపెక్కిన రాజమహేంద్రి

- సుబ్రహ్మణ్య మైదానంలో సీపీఐ జిల్లా 26వ మహాసభలు ప్రారంభం
- కేంద్రం, రాష్ట్రంలో అసమర్థపాలన
- రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ


రాజమహేంద్రవరంలో సీపీఐ శ్రేణుల ప్రదర్శన

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎర్ర జెండాలతో కామ్రేడ్‌లు కదంతొక్కారు. సీపీఐ జిల్లా 26వ మహాసభలు రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్య మైదానంలో ఏర్పాటు చేసిన చిట్టూరి ప్రభాకర చౌదరి వేదికలో జరిగిన ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ముఖ్యవక్తలుగా విచ్చేశారు. తొలుత సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యంలో ప్రజా నాట్యమండలి కళాకారులతో నృత్య ప్రదర్శనలు, జానపద గేయాలతో భారీ స్థాయిలో కార్యకర్తలు స్థానిక చర్చిగేటు నుంచి ప్రదర్శనగా బయలుదేరి దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా సుబ్రహ్మణ్య మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రామకృష్ణ, అక్కినేని వనజ మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అసమర్థ పాలన సాగిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు ఏడాది కాలంలో నష్టపోయారని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తొలిరోజు జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కొండ్రపు రాంబాబు, రేఖా భాస్కర్‌రావు, కాకినాడ, కోనసీమ జిల్లాల కార్యదర్శులు కామిరెడ్డి గోడకొండ, దేవా రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు తోకల ప్రసాద్, వి.కొండలరావు,చప్పా రమణ,పి.లావణ్య, చింతలపూడి సునీల్, రెడ్డి రమణ, జీపీ రామారావు, నల్లా రామారావు, జ్యోతిరాజు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పుష్కర రైల్వే పనులు మొదలయ్యాయి

- ద.మ. రైల్వే జీఎం శ్రీవాస్తవ
- రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్ల పరిశీలన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న రైల్వే జీఎం శ్రీవాస్తవ

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027కి సంబంధించి రైల్వే పనులు మొదలయ్యాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ప్రస్తుతం భౌతిక పనులకు ముందు జరిగే కసరత్తు నడుస్తోందని, భవన తదితర నిర్మాణాలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కచ్చితమైన ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అనుకున్న సమయానికి పనులు పూర్తయ్యేలా విధులు నిర్వర్తించడంతోపాటు ప్రయాణికులకు అన్ని సదుపాయాలు, సౌకర్యాలతో ఏర్పాట్లు ఉండే విధంగా పక్కా ప్లానింగ్‌తో ముందుకు వెళుతున్నామన్నారు. బుధవారం ఆయన రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్లను పరిశీలించారు. రాజమండ్రి రైల్వేస్టేషన్లలో పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. వివిధ విభాగాల వద్ద ప్రస్తుతం ఉన్న ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఇంకా అవసరాలపై ఆరా తీశారు. మ్యాప్ ద్వారా పరిశీలించి సూచనలు చేశారు. స్టేషను రీ-మోడలింగ్‌లో భాగంగా తూర్పు వైపు ఐదు ఫ్లోర్లతో భవనం రానుంది. అయితే పుష్కరాల నాటికి కనీసం రెండు ఫ్లోర్లు పూర్తయ్యే విధంగా పనులు చేయాలని చెప్పారు. గదుల నిర్మాణం పూర్తి కాకపోయినా ఫ్లోర్లను పుష్కరాల విధులకు వచ్చే సిబ్బంది కోసం వినియోగించాలని సూచించారు. ఆరో ప్లాట్‌ఫాం పూర్తికావాలని ఆదేశించారు. అలాగే ప్రయాణికులు వేచివుండే ప్రదేశాల వద్దే టికెట్ కౌంటర్లు, తాగునీరు, ఫ్లాన్లు వంటివి ఏర్పాటు చేయాలని.. కలర్ కోడింగ్ కోడింగ్‌లను ఉపయోగించడం ద్వారా ప్రయాణికులు అయోమయానికి గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాల నాటికి పనులు ఏ మేరకు పూర్తయినా ప్రయాణి కులకు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా ప్లాన్ చేసుకోవాలన్నారు. గోదావరి రైల్వే స్టేషనులో ప్లాట్‌ఫాం నిడివిని బ్రిడ్జి వైపు పొడి గించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా పరమైన ఏర్పాట్లపై ఆర్పీఎఫ్ డీఐజీ ఎస్‌జడ్ ఖాన్‌కి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం మోహిత్ సోనాకియా, ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ షణ్ముగం వడివేలు, ఎస్‌ఆర్‌పీ రాహుల్ దేవ్ సింగ్, ఆర్పీఎఫ్ ఏఎస్సీ కోటా జోజి, ఇన్‌స్పెక్టర్ రాజు, ఏడీఈఎన్ ముత్యాలరావు, ఎస్‌ఎం ఆర్.రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, జోన్, డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి ట్రాక్‌లను పరిశీలిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్‌కు వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలి

కేంద్ర మంత్రి జితేందర్ సింగ్‌కు సానా సతీష్ నేతృత్వంలో ఎంపీల వినతి


కేంద్ర మంత్రి జితేందర్ సింగ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీలు

కాకినాడ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీకి వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలని కోరుతూ కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్‌ను బుధవారం న్యూఢిల్లీలోని టెక్నాలజీ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నేతృత్వంలో రాష్ట్ర ఎంపీలు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు సమర్పించిన అనేక కీలక ప్రతిపాదనలపై ఎంపీలు చర్చించారు. వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలని, శాస్త్రీయ పరిశోధన మౌలిక సదుపాయాలు అందించాలని, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు డాప్లర్ వాతావరణ రాడార్ కవరేజ్ కల్పించాలని రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు కోరారు. వ్యూహాత్మక శాస్త్ర సాంకేతి క రంగంలో జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని ఎంపీల బృందం విన్నవించినట్లు సతీష్ క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

జంతు హింస నివారణకు కేంద్రం ప్రత్యేక చర్యలు

కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జంతు హింస నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ చెప్పారు. బుధవారం ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. జంతు హింస నివారణ చట్టం, 1960 ప్రకారం మొదటి తప్పిదానికి కనీసం రూ.10 నుంచి గరిష్టంగా రూ.50 వరకు జరిమానా విధిస్తున్నామని చెప్పారు. మూడేళ్లలో మరలా తప్పు చేస్తే రూ.25 నుంచి రూ.100 వరకు జరిమానా గానీ, మూడునెలల వరకు జైలు శిక్ష విధిస్తున్నట్టు ఆయన వెల్లడించారన్నారు. గత ఐదేళ్లలో అఖిల భారత జంతు సంక్షేమ బోర్డు దేశ వ్యాప్తంగా 4,589 ఫిర్యాదులు స్వీకరించి ఆయా రాష్ట్రాలకు పంపగా 306 కేసులపై చర్యలు తీసుకున్నట్టు చెప్పారన్నారు. ఏటా జనవరి 14 నుంచి ఫిబ్రవరి 13వరకు జంతు సంక్షేమ మాసం నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారన్నారు.

11న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా-2025

కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల్లో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న ఉదయం 9గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్టు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.వేణుగోపాలవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావాల్సిన అప్రెంటిస్ ట్రినీస్‌ను ఇంటర్వ్యూ చేసి సెలెక్ట్ చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టీసీ సర్టిఫికేట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇస్తూ బుధవారం కాకినాడ కలెక్టర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నోడల్ అధికారి షాన్‌మోహన్ ఆదేశాలు ఇచ్చారు. రెవెన్యూ విభాగంలో ఉన్న వీరికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. వీరు కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

కాకినాడ మత్స్యకారులను విడిపించాలి

శ్రీలంకలోని భారత కాన్సుల్ అధికారికి కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ లేఖ

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా దురదృష్టవశాత్తూ శ్రీలంక దేశ సముద్ర జలాల్లోకి ప్రవేశించి బందీలుగా చిక్కిన కాకినాడ మత్స్యకారులు నలుగురిని విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం శ్రీలంకలోని భారత్ కాన్సుల్ జనరల్ అధికారి సాయిమురళీకి లేఖ రాశారు. కాకినాడ జగన్నాథపురానికి చెందిన పంతాడి బ్రహ్మానందంతోపాటు మరో ముగ్గురు మత్స్యకారులు ఈనెల 2న తమిళనాడులో రెండు బోట్లు కొనుగోలు చేసి సముద్ర మార్గం ద్వారా కాకినాడ తీరం వైపు వస్తుండగా రెండు రోజుల తర్వాత నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య వల్ల దారి తప్పి శ్రీలంక జలాల్లోకి ప్రవేశించడంతో వారిని కంకేసంతురై వద్ద శ్రీలంక నేవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారన్నారు. ప్రస్తుతం జాఫ్నాలో రిమాండ్‌లో ఉన్న నలుగురు మత్స్యకారులను విడుదల చేసి సురక్షితంగా స్వదేశానికి పంపాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.

చదవడం, రాయడం కూడా నేర్పకపోతే ఎలా?

ఆర్జేడీ నాగమణి

సామర్లకోట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తున్నందున విద్యార్థులకు కనీసం చదవడం, రాయడం కూడా నేర్పకపోతే ఎలా అని విద్య ఆర్జేడీ నాగమణి ఉపాధ్యాయులను ప్రశ్నించారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నం జమునానగర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల అకడమిక్ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చదవడం, రాయించడంతో బాటు కూడిక, తీసివేత, గుణకారం, భాగాహారాలు, తరగతికి చెంది ఎక్కాలను కూడా అడిగి విద్యార్థుల మేధస్సు తీరు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవలే ఉపాధ్యాయుల సమీక్షలో సాక్షాత్తూ డీఈవో పలువురు ఉపాధ్యాయుల తీరును హెచ్చరించిన విషయం విదితమే. ఉపాధ్యాయులుగా మనం అంచెలంచెలుగా మారుతున్నప్పుడు విద్య బోధన తీరులో పోకడలు మార్చాలి కదా అని గుర్తు చేశారు. ప్రాథమిక విద్యాస్థాయిలోనే చదవడం, రాయడం అందరు విద్యార్థులు అలవర్చుకునేలా తీర్చిదిద్దాలని ఆర్జేడీ నాగమణి హితవు పలికారు. ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బీజేపీ విజయం

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కాకినాడ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బీజేపీ విజయం సాధించిందని, 2029లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. కాకినాడలోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలో వున్న 11 ఏళ్ల కాలంలో బ్యాంకు లకు రూ.100 కోట్లు పైబడి బకాయిపడిన పారిశ్రామికవేత్తలకు రూ.14.50 లక్షల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. ఇందులో బీజేపీ పెద్దలకు లబ్ధి చేకూరుతూ లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్, అరకు ప్రాంతాల మధ్య ఖనిజాలను పారిశ్రామికవేత్తలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను చిత్రహింసలకు గురిచేస్తోందన్నారు. రకరకాలుగా హింసించి చంపడంతో పాటు కొందరి మర్మాంగాల్ని కోసేశారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో మద్యం పాలసీ విధానంలో కోట్లాది అవినీతి జరిగిందని, అందులో ఉన్న ప్రతిఒక్కరూ జైలుకు పోతారన్నారు. మద్యం కుంభకోణంలో జయలలిత, కేజ్రీవాల్, కవిత జైలుకెళ్లారని, జగన్ కూడా వెళ్లడం ఖాయమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో చోరీ.. తునిలో వదిలి పరారీ..



- సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు లారీ అపహరణ
- రూ.28 లక్షల విలువైన సరుకు మాయం
- రెండు రోజుల క్రితం ఇదే తరహాలో సంఘటన

పిఠాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడుతో ఉంచి లారీ చోరీకి గురి కావడం సంచలనం కలిగించింది. అందులో ఉంచిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అపహరించి లారీని తుని సమీపంలో వదిలివేసి పరారయ్యారు చోరీకి పాల్పడిన ఆగంతకులు.

కాకినాడలోని డైరీఫారమ్ సెంటర్‌కు చెందిన ఓనర్ కమ్ డ్రైవర్ దగ్గు అప్పారావు నగర శివారులోని జెమిని కంపెనీ వద్ద సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను తన లారీలో మంగళవారం సాయంత్రం లోడు చేసుకున్నాడు. లోడు లారీతో రాత్రి 8.30గంటల సమయంలో పిఠాపురం తీసుకువచ్చి వెలంపేటకు చెందిన డ్రైవర్ నాళం రమణకు అప్పగించాడు. లోడు ఒరిస్సాలోని భువనేశ్వర్ తీసుకువెళ్లాలని చెప్పి పిఠాపురంలోని కుంతీమాధవస్వామి ఆలయం సమీపంలో లారీని పార్కు చేశాడు. బుధవారం ఉదయం 5.30గంటల సమయంలో నాళం రమణ వచ్చి చూసుకునే సరికి లారీ మాయమైంది. గుర్తుతెలియని ఆగంతకులు లారీతో ఉడాయించినట్టు గుర్తించాడు. వెంటనే యజమానికి దగ్గు అప్పారావుకు సమాచారం అందించాడు. అందులో రూ.28లక్షలు విలువైన సన్‌ఫ్లవర్ ఆయిల్‌ప్యాకెట్లు ఉండడంతో అప్పారావు పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీసీ కెమెరాలు, గొల్లప్రోలు టోల్‌గేటు వద్ద రికార్డులు, అక్కడ ఉన్న కెమెరాలు పరిశీలించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 1.27గంటలకు టోల్‌గేట్ దాటినట్టు గుర్తించారు. ఫాస్టాగ్ ద్వారా కాకుండా టోల్‌ఫీజును నగదు రూపంలో చెల్లించారు. దీంతో సమీపంలోని అన్ని పోలీసుస్టేషన్లకు సమాచారం అందించారు. ఉదయం 11 గంటల సమయంలో లారీని తుని సమీపంలో 16వ జాతీయ రహదారిపై గల ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో వదిలివేసినట్టు సమాచారం వచ్చింది. దీంతో అక్కడకు వెళ్లి చూడగా అందులో సరుకు పూర్తిగా మాయమైంది. ఖాళీ లారీ మాత్రమే అక్కడ ఉంది. అందులోని సరుకును గొల్లప్రోలు-తుని మధ్య ఎక్కడో చోరీకి పాల్పడిన ఆగంతకులు డంప్ చేసి లారీని వదిలివేసి పరారైనట్టు భావిస్తున్నారు. ఈ సంఘటన పిఠాపురం పరిసర ప్రాంతాల్లో తీవ్ర సంచలనం కలిగించడంతో పాటు చర్చనీయాంశంగా మారింది. సన్‌ఫ్లవర్ లోడు లారీని ఆగంతకులు ఎలా గుర్తించారు, ఇది తెలిసున్న వారి పనా, లేకుంటే లారీని ఫ్యాక్టరీ నుంచి ఫాలో అవుతూ వచ్చిన వారు ఈ సంఘటనకు పాల్పడ్డారా అని అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అదేవిధంగా లారీని ఆగంతకులు తీసుకువెళ్తున్న సమయంలో ఒకవ్యక్తి మోటార్‌సైకిల్‌పై టోల్‌గేట్ దాటే వరకూ వెన్నంటి ఉండటం పోలీసుల విచారణలో వెల్లడైంది.

తుని ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో వదిలివేసిన ఖాళీ లారీ

మరో లారీ చోరీ...

పిఠాపురంలో ఇదే తరహాలో ఆదివారం రాత్రి ఒక లారీ చోరీకి గురైంది. డ్రైవర్స్‌కాలనీలోని టీడీపీ నాయకుడికి చెందిన నూకలలోడుతో ఉన్న లారీని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. అయితే లారీకి జీపీఎస్ ఉన్న విషయాన్ని గుర్తించిన ఆగంతకులు తాము దొరికిపోతామనే భయంతో రౌతులపూడి మండలం గిడజాం వద్ద వదిలి పరారయ్యారు. దీంతో సరుకుతో సహా సదరు నాయకుడు లారీని తెచ్చుకున్నారు.

పోలీసుల తీరుపై విమర్శలు

చోరీలు అధికమవుతున్నా పోలీసులు సరైన నిఘా ఉంచకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2రోజుల క్రితమే లారీ చోరీకి గురై దొరికిన సంఘటన జరిగినా దానిపై పోలీసులు విచారణ జరపకపోవడం, రాత్రి పూట గస్తీ పెంచకపోవడంతో ఇటువంటి ఘటన వెనువెంటనే జరగడానికి కారణమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల పిఠాపుంతో పాటు నియోజకవర్గంలో చోరీలు ఎక్కువైనా రాత్రిళ్లు నిఘా ఎందుకు ఉంచడంలేదనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.



నీలి మేఘం.. గోదారితో స్నేహం...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గౌతమి గోదావరిలో బుధవారం ఈ అందమైన దృశ్యం విశేషంగా ఆకట్టుకుంది. ఒకపక్క ఎండ సుర్రుమనిపిస్తుంటే ఆ వెంటనే చల్లగా నీలిమేఘం దిగివచ్చి గోదావరిని తాకుతున్నట్టు కనిపించిన దృశ్యం గోదావరి బ్రిడ్జిపై ప్రయాణించే వారిని అబ్బురపరిచింది - ఆలమూరు (ఆంధ్రజ్యోతి)

కువైట్‌లో పొన్నమండ యువకుడి మృతి

అధికారుల చొరవతో స్వగ్రామానికి మృతదేహం



దుర్గాసంతోష్ (ఫైల్)

రాజోలు/అమలాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొన్నమండకు చెందిన కడలి సూర్యనారాయణకుమారుడు దుర్గాసంతోష్ (35) ఇటీవల కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతిచెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు బుధవారం తెలిపారు. దుర్గాసంతోష్‌కు మలికిపురం మండలం లక్కవరానికి చెందిన సాయికుసుమతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. జీవనోపాధి నిమిత్తం దుర్గా సంతోష్ 3 నెలల క్రితం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ నివాసం ఉంటున్న గదిలోని ఏసీకి ప్రమాదవశాత్తూ మంటలు అంటుకోవడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. కువైట్ నుంచి సంతోష్ మృతదేహం బుధవారం పొన్నమండకు చేరుకుంది. దుర్గాసంతోష్ అంత్యక్రియలు గురువారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. దుర్గాసంతోష్ మృతదేహాన్ని చూసి భార్య, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టిస్తుంది. ఈ విషయంపై కోనసీమ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పొన్నమండకు చెందిన దుర్గాసంతోష్ మరణించడం దురదృష్టకరమని తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ కీలకంగా పనిచేసి మృతదేహాన్ని గుర్తించడంలో సహాయపడ్డారని తెలిపారు. దాంతో కువైట్ నుంచి కార్గో విమానంలో హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ఏపీ ఎన్ఆర్టీవారి సహాయ సహకారాలతో అంబులెన్సు ఏర్పాటుచేసి ఆ మృతదేహాన్ని పొన్నమండలోని దుర్గాసంతోష్ స్వగృహానికి చేర్చడంలో అధికారులంతా కృషి ప్రశంసనీయమన్నారు. వికాస పీడీ కె.లచ్చారావు, మేనేజర్ జి.రమేష్, సిబ్బంది, మహిళా పోలీసులు షేక్ బీబీసఫియా, హెచ్‌కానిస్టేబుల్ సత్తిబాబును కలెక్టర్ అభినందించారు.

వాడపల్లిలో ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు

ఆత్రేయపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 3 రోజుల పాటు తిరుమల తరహాలో నిర్వహించిన పవిత్రోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. వసంతమండపంలో ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యహవచనం, మహాశాంతి హోమం, ప్రాయిశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, పవిత్రవిసర్జన, మహాదాశీర్వచనం, తదితర కార్యక్రమాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు స్వామివారి పవిత్రోత్సవాలను నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు పవిత్రాలను అలంకరించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉపకమిషనర్ ఈవో నల్లం సూర్యచక్రధరరావు, డీఎస్పీ సుంకర మురళీమోహన్, కూటమినాయకులు, దాతలు స్వామివారిని దర్శించుకున్నారు.



ఆలయంలో స్వామివారికి పవిత్రాలతో అలంకరణ

అభివృద్ధి పనుల పరిశీలన

వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీరామరాజు, భారతి విద్యాభవన్ చైర్మన్ ఉద్దరాజు విశ్వనాధరాజు, రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ సెక్రటరీ కొత్త శ్రీనివాస్, గాంధీ, సురేష్ ప్రముఖులతో కలిసి పరిశీలించారు. వకుళమాత అన్నదాన భవనంలో రూ.1.50కోట్లతో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రామరాజును కోరగా సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కాటేజీ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం అందించేందుకు కొత్త శ్రీనివాస్ ముందుకు వచ్చారని తెలిపారు.



పవిత్రోత్సవ పూజల దృశ్యం

మహాలక్ష్మిగా రత్నగిరి వనదుర్గమ్మ



మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న వనదుర్గమ్మ

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మ అమ్మవారు శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం మహాలక్ష్మి అమ్మవారిగా భక్తులను అనుగ్రహించారు. అష్టఐశ్వర్యాలు ప్రసాదించే దేవతగా దర్శనమిచ్చారు. ప్రముఖ వ్యాపారస్తుడు వీర్ల సూరిబాబు కుటుంబసభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. విశేష పూజలు నిర్వహించారు.

22న రత్నగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఉచిత శ్రావణ శుక్రవార సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఈ నెల 22న నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు
తమ్మయ్యపేట వద్ద ఘటన



మరణించిన అబ్బు

తొండంగి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోదాడ గ్రామానికి చెందిన దడాల అబ్బు (56) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ గ్రామానికి చెందిన అబ్బుకు నడుము నొప్పి కారణంగా కుమారుడు రాజకుమార్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై కాకినాడ ఆసుపత్రికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మోటార్ సైకిల్‌ను రాజకుమార్ నడుపుతుండగా అబ్బు వెనుక కూర్చున్నాడు. తమ్మయ్యపేట కాగితాలమ్మ గుడి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు కిందపడ్డారు. రాజకుమార్‌కు గాయాలు కాగా అబ్బు తలకు బలమైన గాయమై చెవుల నుంచి రక్తం కారింది. బంధువులకు సమాచారం అందించడంతో వారు తుని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అబ్బును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ధృవీకరించారు. రాజకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా..

కాకినాడలో ఆరో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు



హాకీ ఆడుతున్న మణిపూర్, అస్సాం జట్లు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్ షిప్2025లో భాగంగా కాకినాడలో బుధవారం ఆరో రోజు మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. అస్సాం, మణిపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మణిపూర్ 3-1తో విజయం సాధించింది. కేరళ, ఉత్తరాఖండ్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 7-0 స్కోర్‌తో విజయం సాధించింది. హిమాచల్‌ప్రదేశ్, బీహార్ జట్ల మ్యాచ్ 1-1 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్ మ్యాచ్‌లో తమిళనాడు 5-0, మధ్యప్రదేశ్, పంజాబ్ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 4-0తో విజయం సాధించాయి. హర్యానా, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మ్యాచ్‌లో జార్ఖండ్ 7-1తో విజయం సాధించింది. ఒరిస్సా, మహారాష్ట్ర మ్యాచ్‌లో మహారాష్ట్ర 2-1తో విజయం సాధించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జీఎం బి.కిరణ్‌కుమార్, కాకినాడ జిల్లా ముఖ్య ప్రణాళికారి పి.త్రి నాథ్, చేయూత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఎం.రవికుమార్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను వీక్షించారు. హాకీ సంఘ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.థామస్‌పీటర్, భవానీశంకర్ పర్యవేక్షించారు.



జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మ్యాచ్ దృశ్యాలు



ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



భీమనపల్లి ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారుల బృందం

రూ.24,52,346 విలువైన ఎరువులు సీజ్

ఉప్పలగుప్తం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి శ్రీలక్ష్మీనారాయణ ఏజెన్సీలో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో 100 టన్నుల ఎరువులు స్టాకు రిజిష్టర్‌లో నమోదు కానట్టు గుర్తించారు. రూ.24,52,346 విలువైన ఎరువులు సీజ్ చేసినట్టు ఏవో గుత్తుల కుమార్‌బాబు తెలిపారు.

అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు

మలికిపురం మహిళలకు ఎస్‌ఐలుగా ఒకేచోట పోస్టింగ్



ఎస్‌ఐలు కరుణ, రేవతి

మలికిపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురానికి చెందిన కడలి కరుణ, కడలి రేవతి అక్కాచెల్లెళ్లు. వారిద్దరు ఎస్ఐ కోచింగ్ తీసుకుని ఒకేసారి ఎంపికయ్యారు. వారికి మోకా సత్తిబాబు కోచింగ్ సెంటర్ నందు ఉచిత కోచింగ్ అవకాశం కల్పించారు. అక్కాచెల్లెళ్లు ఎస్ఐలుగా ఎంపికవ్వగా విజయవాడసిటీ పోలీసుస్టేషన్‌లో పోస్టింగ్ లభించింది. వారి తండ్రి వెంకటేశ్వర్లు చికెన్ సెంటర్ నందు పనిచేస్తుండగా తల్లి గృహిణి. వారికి ఎస్ఐలుగా పోస్టింగ్ రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నకిలీ ఈపీఎఫ్ చలానాలపై
అన్నవరంలో ఆర్జేసీ విచారణ



ఈవో కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఆర్జేసీ త్రినాథరావు

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శానిటరీ కార్మికుల పీఎఫ్ చెల్లింపులకు సంబంధించి నకిలీ చలానాల వ్యవహారంపై దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలతో బుధవారం ఆర్జేసీ త్రినాధరావు విచారణ చేపట్టారు. ఈవో కార్యాలయంలో శానిటరీ విభాగ అధికారులు, శానిటరీ కాంట్రాక్టర్‌ను పిలిచి దీనికి సంబంధించి విచారణ చేపట్టారు. నకిలీ చలానాలు ఏ విధంగా సమర్పించారు అని కాంట్రాక్టర్ తరుపున వ్యక్తిని ప్రశ్నించగా అవి తాము సమర్పించినవి కాదని, తాము సమర్పించినట్టయితే తమ సంస్థ స్టాంప్, సంతకం ఉంటాయని వివరణ ఇచ్చారు. వివాదం తరువాత ఒకే నెలలో 3 రసీదులు ఒరిజనల్ ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. ఇరువర్గాల నుంచి సమాచారం సేకరించిన ఆర్జేసీ త్రినాథరావు నివేదికను కమిషనర్‌కు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, శానిటరీ ఏఈవో శ్రీనివాస్, సూపరెంటెండెంట్ గుర్రాజు తదితరులు ఉన్నారు.

పంటకాలువలో జారి పడి బాలిక మృతి



పంటకాలువలో బాలిక మృతదేహం కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

కొత్తపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కండ్రిగ శివారు పులుసుగంటివారిపేటకు చెందిన యార్లగడ్డ లోకేశ్వరి(15) ప్రమాదవశాత్తు అమలాపురం- పలివెల ప్రధాన పంట కాలువలో జారి గల్లంతైంది. ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలించగా మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. కండ్రిగకు చెందిన యార్లగడ్డ వెంకటరమణకు పిల్లలు లేకపోవడంతో బంధువుల నుంచి ఓ బాలిక తీసుకుని కుమార్తెలా చూసుకుంటున్నాడు. మంగళవారం ఇంట్లో చెత్తను కాలువలో పడవేసేందుకు లోకేశ్వరి వెళ్లగా కాలు జారి గల్లంతైనట్టు ఎస్ఐ తెలిపారు. దీనిపై వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

15,190 కిలోల బియ్యంతో లారీ స్వాధీనం



పట్టుబడిన లారీతో ఎంఎస్‌వో బాపిరాజు

రాజానగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు సమీపంలో రాజానగరం మండల సివిల్ సప్లై అధికారి గొలుగూరి బాపిరాజు పట్టుకున్నారు. రాజానగరం మండలం ఆటోనగర్ సమీపంలో గ్రామన్ బ్రిడ్జ్ రోడ్డుపై కొవ్వూరు వైపు నుంచి దివాన్‌చెరువు వైపు వెళ్తున్న లారీలో పీడీఎస్(రేషన్)బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. లారీ ముందు తెలుపు రంగు కారులో ఇద్దరు ఎస్కార్ట్‌గా వెళ్తున్నారని చెప్పారు. ఏవిధమైన కాగితాలు తనకు ఇవ్వలేదని, లోడు కూడా మొక్కజొన్న లోడు అని తనకు చెప్పారని, అంతకు మంచి తనకు ఏమీ తెలియదని లారీ డ్రైవర్ తంగిరాల ఏడు కొండలు బదులిచ్చాడన్నారు. రేషన్ బియ్యం బస్తాలను పరిశీలించగా 83 ప్లాస్టిక్ సంచుల్లో 3,140 కిలోలు, 241 సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సంచుల్లో 12050 కిలోలు, మొత్తం 324 సంచుల్లో 15,190 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. బియ్యం విలువ రూ.6,98,740గా అంచనా వేశామన్నారు. డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు బియ్యం యజమాని ఫోన్ నెంబరు తప్ప మరే ఇతర సమాచారం లేదని, ఫోన్ చేస్తే స్విచ్ఛాప్ వస్తుందని, ట్రూకాలర్ ప్రకారం మహమ్మద్ అలియా అని వస్తున్నట్టు ఎంఎస్‌వో చెప్పారు. బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

గండేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లిలో జాతీయరహదారి పక్కన ఉన్న ఒక ఇంట్లో జనవరి 2న చోరీ జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా చోరీకి పాల్పడ్డ కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ షబ్బీర్‌ను బుధవారం గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. రూ.9వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో ప్రవేశపెట్టగా 14రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

దంపతులను నాటు తుపాకీతో కాల్చిన వ్యక్తి అరెస్ట్

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం శృంగధారలో కాకూరి చంద్రరావు, అతడి భార్య సూర్యావతిలను నాటు తుపాకీతో కాల్చిన సంఘటనలో నిందితుడిని బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వివరాలు వెల్లడించారు. శృంగధారకు చెందిన సూర్యావతి రాజవొమ్మంగి మండలానికి చెందిన ముర్ల మణికుమార్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉండి సహజీవనం చేసింది. భర్త, పిల్లలు గుర్తుకురావడంతో వారంక్రితం శృంగధారలో భర్త ఇంటికి చేరుకుంది. దీంతో కక్ష పెంచుకున్న మణికుమార్‌తో నాటు తుపాకీతో చంద్రరావు, సూర్యావతిని ఈనెల 3న రాత్రి కాల్చి గాయపరిచి పరారయ్యాడు. అతడిని పెద్దమల్లాపురం శివార్లలో అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

బైక్‌పై యువకుల ప్రమాదకర ఫీట్లు

అదుపులోకి తీసుకున్న పోలీసులు

పిఠాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై అతి వేగంగా వెళ్తూ ప్రమాదకర ఫీట్లు వేసి విద్యార్థులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన యువకులను కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ యాక్టు 125 కింద కేసు నమోదు చేశారు. పిఠాపురం పాతబస్టాండు వద్ద నుంచి ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా ఉప్పాడ బస్టాండు వరకు ఇద్దరు యువకులు మంగళవారం పలుమార్లు బైక్‌పై విన్యాసాలు చేస్తూ ఆందోళనకు గురిచేశారు. దీంతో పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కొవ్వూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గేదెలను లంకలో మేతకు తోలుకెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన ఇంటి అప్పారావు (49) ఈ నెల 4న గేదెలను మేత కోసం గోదావరి మధ్య లంకలలోకి తోలుకెళ్లాడు. సాయంత్రం గేదెలు తిరిగివచ్చాయి. అప్పారావు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. గ్రామంలోని ఇసుక ర్యాంపు వద్ద తలపాగా, సెల్‌ఫోను, షర్ట్ దొరకడంతో గోదావరిలో గల్లంతై ఉండవచ్చని కుటుంబ సభ్యులు 2రోజులుగా నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో అప్పారావు కుమారుడు ఇంటి అనంత సత్యనారాయణమూర్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన మార్ని వెంకటశివదుర్గాప్రసాద్-సత్యరామలక్ష్మీనాగకుమారి దంపతులు బుధవారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.25వేలు విరాళం సమర్పించారు. ప్రధానార్చకులు ఆశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

వైద్య సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేత


వైద్య సిబ్బందికి సన్మానంచేసి ప్రశంసా పత్రాలు అందిస్తున్న కలెక్టర్

అమలాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంజ జనాభా దినోత్సవంలో భాగంగా కోనసీమ జిల్లాలో ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భాధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం అనంతరం అనే ఇతివృత్తంతో ఉత్తమ వైద్య సేవలు అందించిన సిబ్బందికి జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ బుధవారం ప్రోత్సాహకాలు,ప్రశంసా పత్రాలు అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన ప్రాంతీయ ఆసుపత్రికి చెందిన డాక్టర్ వీరభద్రుడికి నగదు ప్రోత్సాహకం రూ.8వేలు, రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రికి చెందిన ఎస్.ప్రవీణ్‌కు నగదు ప్రోత్సాహకం రూ.7వేలు, ప్రశంసాపత్రాలు అందించారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి ఆర్ఎంసీహెచ్ కౌన్సిలర్ రమాదేవి, రామచంద్రపురం పీపీయూనిట్ ఏఎన్ఎం సులోచన, కాట్రేనికోన పీహెచ్‌సీకి చెందిన పి.వరలక్ష్మి, సఖినేటిపల్లి పీహెచ్‌సీకి చెందిన ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, జె.సుస్మితలకు నగదు ప్రోత్సాహకం కింద ఒక్కొక్కరికీ రూ.2500 వంతున అందించి ప్రశంసాపత్రాలుఇచ్చారు. ముగ్గురు కన్నా ఎక్కువ మంది పిల్లల్ని కన్న దంపతులను లక్కీడిప్ ద్వారా ఎంపికచేసి రొక్కాల హేమలత, సీహెచ్ రాధాకుమారి, ఎన్.వెంకటరమణలకు ఒక్కొక్కరికీ రూ.5వేలు వంతున ప్రోత్సహకాలు, ప్రశంసాపత్రాలు అందించారు. అదేవిధంగా కుటుంబ నియంత్రణ, తాత్కాలిక పద్ధతులు పాటించిన మూడు కుటుంబాలైన భీమవరపు గణపతమ్మ, ఎస్.రాజమ్మ, ఉండ్రాజవరపు గీతలకు రూ.5వేలు వంతున ప్రోత్సహకాలు అందించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారి డాక్టర్ కార్తీక పాల్గొన్నారు.

బాలుర వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన

రాజోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రీముదునూరి అక్కిరాజు మెమోరియల్ అండ్ కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయంతో రాజోలులో సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ బాలుర నంబర్‌వన్ వసతిగృహం నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. అక్కిరాజు సేవాతత్పరతను అందిపుచ్చుకుని హాస్టల్ నిర్మాణానికి ముందుకు వచ్చిన వారి కుమారుడు లతేంద్రవర్మను ఎమ్మెల్యే అభినందించారు. గోదావరిసెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ, జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, జడ్పీటీసీ మట్టా శైలజ, పినిశెట్టి బుజ్జి, సర్పంచ్ రేవు జ్యోతి, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సుస్మితకు అవార్డు ప్రదానం

అంతర్వేది, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంతర్వేదిపాలెం-2 ఉప ఆరోగ్యకేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న జిల్లెల్ల సుస్మితకు కలెక్టర్ మహేష్‌కుమార్, డీఎంహెచ్‌వో దుర్గారావుదొరలు అవార్డు ప్రదానం చేశారు. సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు, గ్రామస్తులు, కుటుంబసభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


మాట్లాడుతున్న ఏడీఏ గౌతమ్‌కుమార్

ముమ్మిడివరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి, వారిని ఆ దిశగా ప్రోత్సహించాలని ముమ్మిడివరం ఏడీఏ గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన రైతు సేవాకేంద్ర సిబ్బందికి ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఏడీఏ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందిన రైతు సేవా కేంద్ర సిబ్బంది వ్యవసాయ అధికారులతో కలిసి గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి ప్రకృతి వ్యవసాయం గురించి వివరించి వారిని ప్రోత్సహించాలన్నారు. మాస్టర్ ట్రైనీలు దుర్గారావు, ఏడుకొండలు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సేద్యంలో మెళకువలు, మార్కెటింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఏవోలు ఎస్.ప్రశాంత్‌కుమార్, వాణి, మృదుల మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మార్పు చేయడానికి కృషి చేయాలన్నారు. వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

మలికిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సీహెచ్ రాకేష్ అన్నారు. మలికిపురం డిగ్రీ కళాశాలలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రమ్యప్రియాంక, జోసెఫ్ రాజా, బాబూరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏఎంవీఐ బాధ్యతల స్వీకరణ

యానాం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): యానాం రవాణాశాఖ అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)గా పుదుచ్చేరికి చెందిన ఎం.ఆరుళలగన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పరిపాలనాధికారి మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

యానాం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తాళ్ళరేవు మండలం పటవలలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కురసాంపేట గ్రామానికి చెందిన కూరుకుల కుమార్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.లక్ష సహాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'చుండూరు' మృతులకు నివాళి

రాజోలు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): 34ఏళ్లక్రితం చుండూరు నరమేధంలో మరణించిన దళిత మృతవీరులకు దళిత చైతన్యవేదిక నాయకులు బుధవారం నివాళులర్పించారు. శివకోటిలో కందికట్లువారి గ్రూపులో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత చైతన్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ చింతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టా సురేష్ అధ్యక్షతన చుండూరు దళిత మృతవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, దళిత చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు లిఖిత పూడి బుజ్జి, మందపాటి మధు, చింతా సత్యప్రసాద్, కందికట్ల సురేంద్ర, పాలపర్తి విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ శివాలయం వీధిలో ఓ నివాసగృహంలో తాచుపాముచేరి హల్‌చల్ చేయడంతో ఆ గృహంలో నివారు, చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. తిరుపతి చిన్నా ఇంట్లోకి మంగళవారం రాత్రి పైపు ద్వారా తాచుపాము ప్రవేశించింది. దీంతో ఆ ఇంట్లోనివారు భయభ్రాంతులకు గురయ్యారు. భీమనపల్లికి చెందిన స్నేక్‌క్యాచర్ వర్మకు సమాచారం అందించడంతో వెంటనే అక్కడకు చేరుకున్న వర్మ పామును చాకచక్యంగా బంధించాడు.

గూడపల్లిలో సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే దేవ


గూడపల్లిలో ప్రజా సమస్యలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గూడపల్లి పల్లిపాలెం గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం గూడపల్లి సచివాలయంలో అధికారులు, కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. రోడ్లు, విద్యుత్ సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అరుంధతిపేట దిగువన ఉన్న యాదవ గ్రూపు వరకు వెళ్లే రోడ్డు స్థల సేకరణపై స్థానిక పెద్దలతో మాట్లాడి ఒక నిర్ణయానికి తీసుకువచ్చారు. సమస్యలపై ప్రజలతో మాట్లాడించారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాని, మీరంతా కలిసివస్తే మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే తాగునీరు, విద్యుత్ సమస్యలను చాలా వరకు పరిష్కారం దిశగా తీసుకువచ్చానన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు సత్యనారాయణ, నరసింహస్వామి, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ సురేష్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్త అక్విడెక్ట్‌కు సోలార్ వెలుగులు


పాత లైట్లను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈఈ రాంబాబు

పి.గన్నవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం శ్రీమతి డొక్కాసీతమ్మ కొత్తఅక్విడెక్ట్‌కు సోలార్ వెలుగులు రానున్నాయి. గతంలో వేసిన విద్యుత్ లైట్లు పది రోజులు కూడా వెలగలేదు. గత ఏడాది వరదల సమయంలో అక్విడెక్టును ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పరిశీలించారు. అక్విడెక్ట్ అభివృద్ధికి, లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. దీంతో కలెక్టర్ రూ.12.05లక్షలు నిధులు మంజూరు చేశారు. బుధవారం పంచాయతీరాజ్ ఈఈ పి.రామకృష్ణారెడ్డి అక్విడెక్ట్‌ను పరిశీలించారు. అక్విడెక్ట్ మొత్తం 39సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి లైట్ ఆటోఆఫ్ అయ్యే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. రెండు రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, త్వరలోనే సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబు, జేఈలు బి.కొండలరావు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఆ జీవోను రద్దుచేయాలి'

అమలాపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకుల అనుమతి నిషేధంపై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం వెనక్కు తీసుకోవాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, నాయకులు ప్రవేశించకుండా నిషేధం విధించడం దారుణమన్నారు. ఉత్తర్వులను వెనక్కు తీసుకోని పక్షంలో అన్నివర్గాలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, సాధనాల రామకృష్ణ, యండమూరి శ్రీనివాస్, గానుగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ వర్ధంతి

పి.గన్నవరం,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్ ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు గద్దర్ వర్ధంతి నిర్వహించారు. డ్రాయింగ్ టీచర్ జి.సత్యనారాయణ బోర్డుపై వేసిన గద్దర్ చిత్రం ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు పి.సత్యనారాయణ, డి.సంగీత పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతను గుర్తించండి

మలికిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ మోజులో పడి ఆరోగ్యాలు పాడుచేసుకోవద్దని ప్రతీ ఒక్కరూ తల్లిపాల ఆవశ్యకతను గుర్తించాలని రాజోలు సీడీపీవో సీహెచ్ ఇందిర అన్నారు. మలికిపురంలో జె.స్వాతి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న ఇందిర మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రిపాలు పట్టిస్తే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. సూపర్‌వైజర్ హైమావతి, కె.స్వాతి, కె.సుజాత, జ్ఞానేశ్వరి, డీఎం సుజాత, చంద్ర, కిశోరబాలికలు, తల్లుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మ పాలు అమృతం

అంబాజీపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పుట్టినబిడ్డకు వెంటనే ముర్రిపాలు ఇస్తే ఆరోగ్యంగా ఉంటాడని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎస్వీ మహలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాచవరం పరిధిలోని మెట్లకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి పాల్గొన్నారు. పీహెచ్ఎన్ ఎం.భూలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు మద్దింశెట్టి దుర్గాదేవి, గుబ్బల వెంకటలక్ష్మి, ఎల్.రాజేశ్వరి, శ్యామల, కృష్ణవేణి, సహాయకురాలు కోమలి నాగలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జక్కంపూడి జయంతి

అమలాపురంటౌన్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): పోరాట యోధుడిగా మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు పేర్కొన్నారు. జక్కంపూడి జయంతిని పురస్కరించుకుని అమలాపురం కాటన్ పార్కులో బుధవారం ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జక్కంపూడిని నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జక్కంపూడి కృష్ణకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ పందిరి శ్రీహరి, ఖాదర్‌వలీ, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జిల్లెల్ల రమేష్, కుడుపూడి భరత్‌భూషణ్, సరెళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే గిడ్డి


చైర్‌పర్సన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్యే గిడ్డిని సన్మానించిన మార్కెట్‌కమిటీ డైరెక్టర్ నిమ్మకాయల వెంకటలక్ష్మి

మామిడికుదురు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. నగరం అగ్రికల్చర్ మార్కెటింగ్ (ఏఎంసీ) పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. చైర్‌పర్సన్‌గా ఎంపికైన పెనుమాల లక్ష్మి జగ్గన్నపేట నుంచి భారీ ఊరేగింపుగా బాణసంచా కాల్పులు, తీన్మార్ డప్పులతో ఏఎంసీ ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాలకమండలి ప్రమాణస్వీకారం చేశారు. చైర్‌పర్సన్, సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కమిటీ రైతుల సమస్యలను పరిష్కరించి కమిటీని ప్రగతిపథంలో నడిపించాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, షేక్ సుభాన్, పెచ్చెట్టి చంద్రమౌళి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, జాలెం శ్రీనివాసరాజా, మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తరలివెళ్లిన నేతలు

పి.గన్నవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరం మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి బుధవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో పాటు కూటమి నేతలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తొలుత పార్టీ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే కూటమి నేతలతో కలిసి బాణసంచా కాల్పులు, తీన్మార్ డప్పులతో ర్యాలీగా మూడు రోడ్ల కూడలికి చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం తరలివెళ్లారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మట్టపర్తి రామకృష్ణ, చొల్లంగి సత్యనారాయణమూర్తి, సయ్యపురాజు సత్తిబాబురాజు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, బొండాడ నాగమణి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, గుత్తుల చంటి, గణపతి వీరరాఘవులు, శేరు శ్రీనుబాబు, ఆరుమిల్లి లాల్‌బాబు, నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఆదిమూలం సూరయ్యకాపు, నిమ్మకాయల శేషారావు, అన్నాబత్తుల హనుమాన్, గుత్తుల రామకృష్ణ, తాటికాయల శ్రీనివాసరావు, పాలూరి ఫణి ఉన్నారు.

'సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలు'

అంతర్వేది, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఉభయ గోదావరి పట్టభద్రుల శాసనమండలి సభ్యుడు పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించారు. గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, నాయకుల సారథ్యంలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, పులగం రమేష్, ఏ1 సేవాసమితి సభ్యులు చెల్లుబోయిన శ్రీనివాస్, అయినవిల్లి సత్యనారాయణ, అడబాల విజయ్, అడబాల శ్రీనివాస్, బొలిశెట్టి వెర్రియ్య, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో శ్రావణ పూజలు



అంబాజీపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట పెద్దవీధిలోని నాగమల్లిచెట్టు ప్రాథమిక పాఠశాలలో ఒక విద్యార్థినిని విద్యార్థులు అమ్మవారిగా అలంకరణ చేసి శ్రావణమాస పూజలు చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. సంప్రదాయాలు తెలియజేస్తే వారిలో చైతన్యం పెరుగుతుందన్నారు. హెచ్ఎం వాడ్రేవు సూర్యనారాయణమూర్తి, వరలక్ష్మిదేవి, వరలక్ష్మి, లక్ష్మీరమణ, శ్రీదేవి, పాఠశాల చైర్మన్ లక్ష్మి పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి: కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నిర్మల్‌కుమార్

అమలాపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సిబ్బంది విధిగా సమయ పాలన పాటించాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సకాలంలో సర్వేలు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సూచించారు. పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం వివిధ సెక్షన్ల హెడ్‌లు, సచివాలయ సిబ్బందితో వేర్వేరుగా రివ్యూ సమావేశాలు నిర్వహించారు. స్వాతంత్ర్య వేడుకల నిర్వహణ, పన్నుల వసూళ్లు, మెరుగైన శానిటేషన్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్ డీఈ కేవీవీ సత్యనారాయణ, మేనేజర్ డి.ప్రభాకర్, టీపీవో బి.రాణిసంయుక్త, ఏఈలు బి.భాస్కర్, కె.వెంకటేష్, వి.కృష్ణ, ఆర్వో బిజశ్రీలక్ష్మి, కె.రామకృష్ణ, మంగాదేవి, బి.లలిత తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

మామిడికుదురు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు దీప్తి కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు దీప్తి కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఐఎంబీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాలో ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని 200మందిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తామని, డిగ్రీ కనీస అర్హత కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు పూర్తి డేటాతో హాజరుకావాలన్నారు. వివరాల కోసం ఐఎంబీ ప్రతినిధి సాగర్‌ను 8499025599లో సంప్రదించాలని కోరారు.

తల్లి పాలే శ్రేష్ఠం

అమలాపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డలకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శాంతికుమారి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని బండారులంక శివారు చినచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రం-175లో బుధవారం సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాంతికుమారి తల్లిపాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, గర్భిణీలకు చీరలు పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన సామగ్రిని అంగన్‌వాడీ కేంద్రాలకు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాడా మాధవి, సూపర్‌వైజర్లు విజయ, మహేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

మలికిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలు త్రివేణి, నానిలను ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పరామర్శించారు. మోరిపోడు సర్పంచ్ త్రివేణి తల్లి మిస్సమ్మ ఇటీవల మృతిచెందారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నానికి ఆమె బంధువు అవుతుంది.

ఉపాధ్యాయులకు సన్మానం

మామిడికుదురు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి బాడవ జిల్లా పరిషత్ హైస్కూలులో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కె.అనుపమ, జి.సీతామహాలక్ష్మి, ఎం.ప్రవీణ, ఎల్.స్వాతిలను బుధవారం ప్రధానోపాధ్యాయుడు కేఎస్వీ నాగోజీరావు దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఉపాధ్యాయులుగా వారు పాఠశాలకు అందించిన సేవలు కొనియాడారు.ఎస్ఎంసీ చైర్మన్ పి.నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన


అనాతవరంలో నాట్లు వేస్తున్న విద్యార్థులు

ముమ్మిడివరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అనాతవరంలోని ఒక ప్రైవేట్ స్కూలు విద్యార్థులతో ఓ రైతు పొలంలో విద్యార్థులతో స్వయంగా వరి నాట్లు వేయించారు. వరి సాగు ఎలా చేయాలి, ఏ సమయంలో ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేయాలి, పంటకోత విధానం వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మెట్ల సురేష్, స్కూలు ఫౌండర్ వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



కాట్రేనికోన, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉప్పూడి మాజీ సర్పంచ్ నెల్లి పల్లారావు(65) బుధవారం మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన ఉప్పూడికి ఒక పర్యాయం సర్పంచ్‌గా, రెండు సార్లు ఎంపీటీసీగా సేవలందించారు. ఆయన మృతికి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, రంబాల చిట్టిబాబు, ఎంపీటీసీ ర్యాలి వీరబాబు, ర్యాలి బద్రి, రంబాల దొరబాబు, కొంకి అప్పలస్వామి, దొంగ బాబూరావు, బొబ్బిలి చిన్ని, పోలిశెట్టి పెద్ద, రంబాల చౌదరిబాబు సంతాపం తెలిపారు.

నేత్ర దానం


సూవర్ణకుమారి

పి.గన్నవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురానికి చెందిన గంపాల సూవర్ణకుమారిని ఇటీవల తేనె టీగలు దాడి చేయడంతో కాకినాడ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కుమారుడు సత్యసూసన్య, కుమార్తెలు మేరి బ్లెసింగ్, ఫ్లారెన్స్, మార్విన్‌లు తన తల్లి కళ్లను కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంకుకు దానం చేశారు. ఈసందర్భంగా వారిని పలువురు అభినందించారు.

ఉపాధ్యాయుడికి పరామర్శ

అంబాజీపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడు దొంగ ఏడుకొండలను వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, నాయకులు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, నాయకులు ఎం.ఎం.శెట్టి, రాయుడు షణ్ముఖ్‌లు పరామర్శించిన వారిలో ఉన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): యానాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై బుధవారం అధికారులతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో జరిగిన సమీక్షలో మున్సిపాల్టీ, ప్రజాపనులశాఖ, రెవెన్యూ తదితర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. సీఎస్ఆర్ తదితర అభివృద్ధి పనులపై సమీక్షించారు. జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, త్వరలో చేపట్టే పనులకు సంబంధించి నివేదికలను సిద్ధం చేయాలని మల్లాడి సూచించారు.

రాజోలు సీడీపీవోగా ఇందిర



మలికిపురం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): రాజోలు ఐసీడీఎస్ సీడీపీవోగా సీహెచ్ ఇందిర బాధ్యతలు స్వీకరించారు. పాలకొల్లు నుంచి బదిలీపై రాజోలు వచ్చినట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి కృషి చేస్తానన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెరిగేలా పనిచేస్తామన్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సహకారంతో అవసరమైనచోట భవనాల నిర్మాణానికి ముందుకు వెళతామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మామిడికుదురు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ యూటీఎఫ్ నాయకులు బుధవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీపీ సుబ్బారావు, జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.నాగేంద్రప్రసాద్, బి.పెద్దిరాజు, టీఆర్కే గణపతిరావు, మొహిద్దీన్, ఎం.సత్యనారాయణ, కె.నరసింహారావు పాల్గొన్నారు.

వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

అయినవిల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, సంప్రదాయబద్ధంగా ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న దానికంటే అత్యంత వైభవంగా నిర్వహించాలని గ్రామ సభ తీర్మానించింది. అయినవిల్లిలో బుధవారం సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన వినాయకచవితి మహోత్సవ ఏర్పాట్లపై గ్రామసభ నిర్వహించారు. భక్తులకు మెరుగైన సౌకర్యం కల్పించాలని, భారీవాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరగా దర్శనమయ్యే విధంగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, తొమ్మిది రోజుల పాటు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

కపిలేశ్వరపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుమూడి పాల కేంద్రం వద్ద బుధవారం ఓఎన్జీసీ సహకారంతో నిర్మించనున్న బిల్డింగ్, ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. రూ.9.70 లక్షలతో నిర్మించనున్న బిల్డింగ్, ఆర్వో ప్లాంటుకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీటి నిర్మాణంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ చైర్‌పర్సన్ కె.స్వర్ణలత, టీడీపీ మండల అధ్యక్షుడు బలవరెడ్డి సత్తిబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బోణం నానిబాబు, ఇళ్ల రాంబాబు, ఎ.బూరయ్య, బండారు స్వామి నాయుడు తదితరులతోపాటు కార్యదర్శి శారద, వీఆర్వో ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.


వెదురుమూడిలో ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



కపిలేశ్వరపురంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ, వైద్య, ఆరోగ్య సిబ్బంది. పక్క చిత్రంలో ఆలమూరు జొన్నాడలో తల్లిపాల వారోత్సవాల్లో సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

తల్లిపాలే...బిడ్డకు శ్రేయస్కరం

కపిలేశ్వరపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందించడం ఆరోగ్యకరమని కపిలేశ్వరపురం, సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ డాక్టర్ దుర్గాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక సీహెచ్‌సీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆరునెలల పాటు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మల్లికార్జునుడు, ఎంపీహెచ్ఎస్ నానిబాబు, ఎంఎల్‌హెచ్‌వీ మనీష, ఎంపీహెచ్ఎ(ఎఫ్) శిరోమణి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు శిశువుకు వ్యాధి నిరోధక టీకాలా పనిచేస్తుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుజాతరాణి అన్నారు. జొన్నాడలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో సుజాతరాణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్ బి.శాంతకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, వై.అరుంధతి, బి.వరలక్ష్మి, కూటమి నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ టి.నతానియేలు అన్నారు. బుధవారం రాయవరంలో క్రీస్తు సంఘం, లవ్ అండ్ కేర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డోర్కా ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఫౌండర్ నతానియేలు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలతో పాటు 12 మందికి ఉచిత కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు టి.కిషోర్, టీపీ రత్నం, మందపల్లి కొండలరావు, మణెమ్మ, ట్రైనర్ ఎం.వరలక్ష్మి, పాస్టర్ దానియేలు, సీహెచ్ భాస్కర్, పౌలు, నాగేశ్వరరావు, నాని, బాలు, క్రీస్తు సంఘం సభ్యులు పాల్గొన్నారు.


కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, వాసంశెట్టి సత్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 6, 7, 10, 11, 12, 15, 16, 18, 27వ వార్డుల్లో అభివృద్ధి పనులకు ఆయా వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులతో కలసి శంకుస్థాపన జరిపారు. 17వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, డీఈఈ శ్రీకాంత్, ఏఈ సునీల్, వార్డు కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరించిన ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల

మండపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రజా సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జనవాణిలో పార్టీ నేతలతో కలిసి ఆయన ప్రజల అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు అక్కల గాంధీ, పి.శివపార్వతి, లీగల్‌సెల్ ప్రతినిధి బి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న వేగుళ్ల లీలాకృష్ణ, జనసేన నేతలు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

కె.గంగవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. బుధవారం ఆసుపత్రి ఆవరణలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఆసుపత్రిలో 24 గంటలూ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత, సౌకర్యాల లేమి వంటి అంశాలను డాక్టర్ హర్షిత, విష్ణువర్ధన్ కమిటీ సభ్యుల దృష్టిలో పెట్టారు. రాత్రిపూట మద్యం సేవించిన వ్యక్తులు విధులు నిర్వహిస్తు సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. దీనిపై కూటమి నాయకుడు మరివాడ సూరిబాబు ఎస్ఐ ఎస్.కె. జానీబాషాతో మాట్లాడి రక్షణ కల్పించాలని కోరారు. పూర్తిస్థాయి సిబ్బంది వచ్చే వరకూ ఉన్న వారితో వైద్య సేవలు అందించాలని ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ సురేంద్ర రెడ్డి సూచించారు. సమావేశంలో వాసంశెట్టి సూరిబాబు, నానావరపు శ్రీనివాసు, పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించడమే లక్ష్యం

కె.గంగవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించే లక్ష్యంతో హర్‌ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జ్ కర్రి చిట్టిబాబు అన్నారు. బుధవారం అముజూరు గ్రామంలో హర్‌ఘర్ తిరంగ నిర్వహించగా, దీనికి ఆయన హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు, నాయకులు సలాది శేఖర్, సలాది వీరబాబు, అవసరాల రమణమూర్తి, నారాయణమూర్తి, వాసంశెట్టి గోవిందు తదితరులు పాల్గొన్నారు.


జాతీయ జెండాతో బీజేపీ నాయకులు

తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం

కె.గంగవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ రామచంద్రపురం ప్రాజెక్టు అధికారి వి.వరాహలక్ష్మి అన్నారు. బుధవారం కుందూరు సావరంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. ఐదుగురు గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ వి.అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.


మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, తనయుడు సంజీవ్‌తో కలిసి బుధవారం మంత్రి లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ప్రసాదం స్కీమ్‌లో వాడపల్లిని అభివృద్ధి చేయాలని, లొల్లలాకుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఆయా అంశాలపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారన్నారు. తొలుత యువనేత సంజీవ్, మంత్రికి వాడపల్లి వేంకటేశ్వర స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

12న పోలమ్మతల్లి ఆవిర్భావ దినోత్సవం

రాయవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్తుల ఆరాధ్యదైవం పోలమ్మ అమ్మవారి ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 12న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ నౌడు వెంకటరమణ తెలిపారు. బుధవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం మూడవ మంగళవారం అమ్మవారు వెలసిందన్నారు. పోలమ్మ, ముత్యాలమ్మ అమ్మవారి ఆవిర్భావాన్ని పురస్కరించుకుని కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి ఏకాహం, భగవద్గీత శ్లోకాలు, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాయవరం పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఎగురవేయాలి

ద్రాక్షారామ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు కోరారు. బుధవారం ద్రాక్షారామలో హరఘర్ తిరంగా కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, బీజేపీ నాయకులు పి.రాంబాబు, వి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


వాటర్ కూలర్ అందజేస్తున్న జి. శ్రీనివాస్, మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్ తదితరులు

వాటర్ కూలర్ బహూకరణ

మండపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బూరుగుంట చెరువు వద్ద వున్న వైఎస్ఆర్ పార్కుకు వచ్చేవారి దాహార్తిని తీర్చేందుకు పట్టణానికి చెందిన గనిశెట్టి శ్రీనివాసరావు బుధవారం వాటర్ కూలర్ అందజేశారు. పార్కులో పలు మొక్కలను ఆయన మిత్రులతో కలిసి నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, భాస్కరరాజు, లంకరవి తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ వేసెక్టమీ సర్జన్‌గా అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రవీణ్

డాక్టర్ ప్రవీణ్‌కు ఉత్తమ వేసెక్టమీ సర్జన్ అవార్డు

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ బుధవారం జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ వేసెక్టమీ సర్జన్‌గా ప్రశంసా పత్రం అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ప్రశంసాపత్రంతో పాటు మెమొంటోను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అందజేశారు. అవార్డు అందుకున్న ఆయన్ను పలువురు అభినందించారు.

ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

కె.గంగవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించాలని వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడిఏ బి.నాగకుమార్ అన్నారు. బుధవారం కోటిపల్లి, కోట గ్రామాల్లో పొలం పిలుస్తుంది జరగ్గా, ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. ఏవో సద్గురుమూర్తి మాట్లాడుతూ రైతులు తమ పంటకు సంబంధించి పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఊడిమూడి సొసైటీ అధ్యక్షుడు గాలి వెంకటేశ్వర్లు, వీఏఏ నాని బాబు, వీహెచ్ఏ లావణ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలోని ప్రగతి ఇంగ్లీషు మీడియం పాఠశాలను ఎంఈవో రాఘవరెడ్డి, ఎంఎస్‌వో శ్రీముఖి సోని ప్రియదర్శిని బుధవారం తనిఖీ చేశారు. పరిసరాల శుభ్రత, మౌలిక వసతులు, అగ్నిమాపక పరికరాలను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తారాస్థాయికి చేరుతున్న ఎండలతో జనం విలవిల

• ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి • సతమతమవుతున్న రైతులు, ఉద్యోగులు

కె.గంగవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వర్షాలు పడాల్సిన సమయంలో ఎండలు తారాస్థాయికి చేరుతున్నాయి. వేసవిలోనూ ఇంత తీవ్రంగా లేవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎండవేడికి ప్రజలు అల్లాడి పోతున్నారు. బయటికి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో వాతావరణం ఎంత వరకూ చల్లబడటం లేదని గగ్గోలు పెడుతున్నారు. ఇటీవలి ఎండలకు హడలిపోతున్నామని, పంటలకు అధిక మొత్తంలో ఎరువులు వాడాల్సి వస్తున్నదని రైతులంటున్నారు. ఇలాగే మరికొన్ని రోజులు ఎండల కాస్తే పెట్టుబడులు మరింత పెరిగిపోతాయని రైతులతో పాటు కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.


పామర్రులో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

పుష్కరాల నాటికి దేవాలయాల ఆధునికీకరణ జరగాలి

మండపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలో వున్న దేవదాయ ధర్మాదాయశాఖకు చెందిన ఆలయాల అభివృద్ధిపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో బుధ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవస్థానాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి చెంతనే ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న దేవాలయాలు శిథిలావస్థకు చేరినవి ఉంటే వాటికి కూడా అంచనాలు తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ బాలాజీ రామ్‌ప్రసాద్, డీఈఈ ఉదయ్ కుమార్, డిప్యూటీ స్థపతి శ్రీనివాసాచార్యులు, ఆయా ఆలయాల ఈవోలు తదితరులు పాల్గొన్నారు.


క్యాంపు కార్యాలయంలో దేవదాయశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల


నార్కెడిమిల్లి వద్ద నదీకోత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హెడ్‌వర్క్స్ అధికారులు

నదీకోత ప్రాంతాన్ని పరిశీలించిన హెడ్‌వర్క్స్

ఆత్రేయపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి గ్రామంలోని వశిష్ఠ గోదావరి నదీతీరం కోతకు గురవుతోంది. ప్రతి ఏటా గోదావరి కోతకు లంక భూములు తరిగిపోతున్నాయి. ఇటీవల మాజీ సర్పంచ్ మద్దింశెట్టి సత్యనారాయణ రైతులతో కలిసి ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు సమస్యను తెలిపారు. ఒకానొకదశలో ఎంపీ హరీష్‌మాధుర్‌కు రైతులు విన్నవించారు. ఎంపీ, ఎమ్మెల్యే సిఫార్సుతో రైతులు ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హెడ్‌వర్క్స్ ఏఈ సుధాకర్ కోతకు గురవుతున్న ఐదు ప్రాంతాలను గుర్తించారు. ఐదు చోట్ల గ్రోయిన్స్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు తెలిపారు.



డిపో వద్ద నిరసన తెలుపుతున్న యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్

గవర్నర్‌పేట డిపోను లులూమాల్‌కు ఇవ్వడం తగదు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నర్‌పేట ఆర్టీసీ డిపోను ఇంటర్నేషనల్ లులూ మాల్‌కు ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని కోరుతూ రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో కార్మికులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు శ్రమతో కోట్లాది రూపాయల ఆస్తులు సమకూర్చుకుందని వక్తలన్నారు. నయా ఆర్థిక విధానాల్లో ఈ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పే విధానాలు ప్రభుత్వాలు తీసుకొస్తున్నాయని వక్తలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని గేట్ మీటింగ్‌లో యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు వీవీవీ ఎస్.నారాయణ, జాయింట్ సెక్రటరీ ఎస్ఆర్ బాబు, వైస్ ప్రెసిడెంట్ టి.రాజు, కోశాధికారి కె.మంగేష్‌రావు, రైతుకూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ తదితరులు పాల్గొన్నారు.


చెల్లూరులో బ్యాంక్ ఆఫ్ బరోడా జన సురక్ష పథకాల కరపత్రాలను విడుదల చేస్తున్న డీజీఎం మురళీకృష్ణ

జనసురక్ష పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

రాయవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా అమలు చేస్తున్న జనసురక్ష పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ జోనల్ హెడ్ మురళీకృష్ణ కోరారు. బుధవారం చెల్లూరు బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీజీఎం పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రీజనల్ హెడ్ శ్రీనివాస్, ఎల్‌డీఎం పి.కేశవవర్మ, కె.వెంకట్రాజు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నూనె గింజల ఉత్పత్తి పెంచేలా కృషి చేయాలి

కపిలేశ్వరపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దేశంలో నూనెల గింజల ఉత్పత్తి పెంచేలా రైతులు కృషి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. బుధవారం టేకి సహకార సొసైటీ వద్ద ఉద్యాన శాఖ సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగు, తోటల విస్తరణపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉద్యానశాఖ జీఎం ప్రభాకరరావు, ఏజీఎం వీరభద్రరావు పలు అంశాలపై రైతులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యేను సంస్థ ప్రతినిధులు సన్మానించారు. సొసైటీ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల నాగమణి, సొసైటీ చైర్మన్ మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులతో పాటు ఏవో బలుసు రవి, సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు సత్కారం

రావులపాలెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రావులపాడు సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను బుధవారం సత్కరించారు. సర్పంచ్ మట్టా సత్యదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి పట్టాభిరామయ్యతో పాటు ఇప్పటి వరకూ విధులు నిర్వర్తించిన సచివాలయ సిబ్బందిని సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇఫ్కో సంస్థ అందించిన మొక్కలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఇఫ్కో సంస్థ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ బీఎల్ రాజు మాట్లాడుతూ నానో ఎరువుల వల్ల కాలుష్యం ఉండదన్నారు. జిల్లా ఇన్‌చార్జి శ్యామ్‌ప్రసాద్ బాబు మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో తమ ఇఫ్కో సంస్థ 4వేలు మొక్కలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, పి.రామకృష్ణారెడ్డి, ఆలమూరు వ్యవసాయ శాఖ ఏడీ సీహెచ్‌కేవీ చౌదరి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ మురళీమోహన్

సైబర్ భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

ఆత్రేయపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ భద్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పేర్కొన్నారు. బుధవారం ఆత్రేయపురం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరగాళ్లు యువతను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. మహిళల భద్రతకు రూపొందించిన శక్తియాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పీఎస్ రాజు, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ రాము, ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

కె.గంగవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పామర్రు ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన పితాని శ్రీనివాసు, పసగాడి హరిసూర్యనారాయణ, యండమూరి ఆంజిబాబు, నామ సురేఖ, పి.సురేష్ కుమార్, ఆర్.మాలిని, కట్టా గోవిదరాజులకు బుధవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు, విశ్రాంత ఉపాధ్యాయుడు చిట్టూరి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.